## వెండికొండ జాతరకు వర్షంతో ఆటంకం

### భారీగా సంఖ్యలో తగ్గిన భక్తులు



**శంషాబాద్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** ప్రతి ఏటా శ్రావణ మాసం చివరి వారంలో నిర్వహించే శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి జాతర మహోత్సవానికి వర్షం తీవ్ర ఆటంకం కలిగించింది. రెండు రోజు లుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఆదివారం జరిగే జాతర మహోత్సవానికి భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. సాయంత్రం శంషాబాద్ పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. పుష్పరథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి వీధులగుండా భాజా భజన్త్రీలతో భక్తి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు ద్వారా స్వామివారి విగ్రహం వెండకొండకు చేరుకున్నది. ఓ వైపు వర్షం కురుస్తున్నా దానిని లెక్క చేయకుండా భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** మండలంలో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ తెలిపారు. రానున్న రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గతకొన్ని సంవత్సారాల నుండి శిథిలావస్థకు చేరుకున్న, పాడుబడ్డ ఇండ్లల్లో ప్రజలు ఉండకూడ దని, గతరెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోడలు నాని ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటాయని, సురక్షితమైన ప్రదేశంలో ఉండడం శ్రేయస్కరమని, పాడుబడ్డ బావులచుట్టూ కంచలేని భావుల దగ్గర జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వర్షంలో తడిచిన విద్యుత్ స్తంభాలు, తడి చేతులతో స్టార్టర్లు, మోటర్లు, స్విచ్ బోర్డులు ముట్టుకోవద్దని, చిన్నపిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలని, రూమ్‌లో మెరుపుల సమయంలో డిష్‌వైర్ టీవీ నుంచి తీసివేయాలని, రోడ్లపై ప్రమాదకరంగా వాగులు ప్రవహించే సమయంలో అత్యుత్సాహంతో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసులకు గాని, డయల్ 100కు ఫిర్యాధు చేయాలని ఎస్ఐ తెలిపారు.



ప్రాజెక్టు వద్ద అలుగుపై నుంచి పారుతున్న నీరు

## కోటపల్లి ప్రాజెక్టుకు జళ కళ

### నిండు కుండలా ప్రాజెక్టు

### రబి సాగుపై ఆశలు పెంచుకున్న రైతులు

### ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టిసారించాలి

**పెద్దేముల్, జూన్ 12, ప్రభాతవార్త:** గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోటపల్లి ప్రాజెక్టు జళ కళను సంతరించుకుంది. కోటపల్లి ప్రాజెక్టు నీటి సామర్థ్యం 24 అడుగులు ఉండగా పూర్తిగా నిండి నిండు కుండలా తలపిస్తు అలుగుపై నీరు పారుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అతి పెద్ద మధ్యతరహా ప్రాజెక్టు కోటపల్లి ప్రాజెక్టు, ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పారుతుండటంతో రబి సాగు చేసేందుకు రైతులు ఆశలు పెంచుకున్నారు. అయితే అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా ఆయకట్టుదారుల పరిస్థితి తయారైంది. ప్రాజెక్టు పూర్తిగా నిండిన కాలువలు, తూములు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో నీరంతా వృథాగా పోయి సాగుకు నోచుకోవడంలేదు. ప్రాజెక్టు ఆయకట్టు కింద 9200 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ప్రాజెక్టు నిండిన ప్రతియేటా రబి సాగుకు గాను పెద్దేముల్ మండల పరిధిలోని మంచన్‌పల్లి, కొండాపూర్, మదనంతాపూర్, రెగొండి, రుక్మాపూర్, మంబాపూర్, ఖానాపూర్, బండపల్లి, జనగాంతో పాటు ధారూర్ మండలంలోని గట్టెపల్లి, రుద్రారం, నాగసమందర్, అల్లాపూర్ తదితర గ్రామాలకు సాగునీటిని వదిలేవారు. అయితే కాలువలలో పిచ్చి మొక్కలు మొలవడమే కాకుండా, తూములు, షట్టర్లు మరమ్మత్తులకు నోచుకోక సాగునీరంతా మంచన్‌పల్లి, నాగసమందర్ తదితర వాగులలో వృథాగా పోతోంది. ఫలితంగా సాగు నీరందక చివరి ఆయకట్టు భూములు ఎండిపోయిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం అతికష్టం మీద 4000 ఎకరాలకు సాగు నీరందుతోంది. మిగతా ఆయకట్టు భూములు ఎడారిలా తలపిస్తున్నాయి. కాలువలు, తూములు మరమ్మత్తులకు నోచుకోక ఇంతకింతకు సాగు విస్థీర్ణం తగ్గుతుండటంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు కాలువలపై సంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాలువలు కబ్జాకు గురువుతున్నాయి. అంతేగాకుండా అక్కడక్కడ ఏర్పాటు చేసిన తూముల, షట్టర్ల పనిముట్లను ఎత్తుకెళ్ళిన పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువలు, తూములకు మరమ్మత్తులు చేపడితే చివరి ఆయకట్టు భూములకు నీరందడమే కాకుండా భూగర్బజలాలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని ఆయా గ్రామాల రైతులు విన్నవిస్తున్నారు. ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా తలపిస్తున్న కోటపల్లి ప్రాజెక్టుకు అధిక నిధులు వెచ్చించి ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొచ్చెలా తెలంగాణ ప్రభుత్వం కృషిచేయా లని ఆయకట్టుదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కోటపల్లి ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించాలని అసెంబ్లిలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి విన్నవించిన విషయం తెలిసిందే. నిధుల మంజూరుతో మరమ్మత్తులు చేపడితే ప్రాజెక్టు ఆయకట్టు కింద భూములన్ని పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా కళకళలాడేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

## వర్షం బాధితులను ఆదుకుంటాం..!

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### నియోజకవర్గంలో 19 ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి

### రెండు చెరువు కుంటలు కట్టలు తెగాయి

### ఇళ్ళు కోల్పోయిన వారికి పక్కా గృహాలు



మీడియాతో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 01) :** వర్షానికి నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలో అధికారుల లెక్కల ప్రకారం 19 ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. అదేవిదంగా నియోజకవర్గంలోని చౌదరిగూడ మండలం ఎదిర గ్రామంలో చెరువు కట్టకు గండి పడిందని, అలాగే షాద్‌నగర్ పట్టణంలో మామిడికుంట చెరువు కట్ట తెగిందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని జిల్లేడ్ చౌదరిగూడెం మండలంలోని తుమ్మలపల్లి, గుర్రంపల్లిలో రెండు ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయని, కేశంపేట మండలంలో 10 ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయని, కాకునూరులో రెండె ఇళ్ళు, పోమాలపల్లిలో ఒకటి, నిర్ధవెల్లిలో అయిదు, కొండారెడ్డిపల్లి, లింగందన గ్రామాలలో ఒక్కో ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొత్తూరు మండలంలో రెండు ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయని, కొడిచెర్ల, తిమ్మాపూర్ గ్రామాలలో ఒక్కో ఇళ్ళు, నందిగామ మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఒకటి, ఫరూఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లి, వెలిజర్ల గ్రామాలలో ఒక్కో ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారుల ద్వారా తెలిసిందన్నారు. ఇళ్లతో పాటు వర్షం దాటికి రైతులు పంటలను కూడా నష్టపోతున్నట్లు సమాచారం ఉందని, అధికారుల ద్వారా రైతు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నరనాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, వీరేశం, రాజు, చల్లా శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శేఖర్, గోరీ, తదితరులు పాల్గొన్నారు.

# వర్ష బీభత్సం



లఖ్నాపూర్ ప్రాజెక్టును సందర్శించి హారతీ ఇస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

### ఉమ్మడి జిల్లాను ముంచెత్తిన వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

### ప్రాజెక్టులకు జలకళ.. జనజీవనం అతలాకుతలం .. అప్రమత్తమైన అధికారగణం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వరుణ దేవుడు కన్నెర్రజేయడంతో వికారాబాద్ జిల్లా అతలాకుతలమైంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. తాండూరులో ఆదివారం 9.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కూడా 8 నుంచి 9 సెంటీమీటర్ల మేరకు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలకు తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పట్టణాల్లో పలు కాలనీలు నీటమునిగాయి. జిల్లాలో శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలిపోయాయి. తాండూరు మండలం అంతారం తండా, బిజ్జారం గ్రామాల్లో రెండు ఇండ్లు పాక్షికంగా కూలాయి. జిల్లాలో ఉన్న ప్రధాన జలాశయాలకు భారీగా వరదనీరు చేరింది. ధారూరు మండలంలో 24 అడుగుల నీటి సామర్థ్యం గల కోటపల్లి మధ్యతరహా ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. యాలాల మండలంలో 20 అడుగుల సామర్థ్యం గల జుంటుపల్లి కూడా పూర్తిస్థాయికి చేరింది. ఇన్‌ఫ్లో భారీగా రావడంతో అలుగుల మీదుగా వరదనీరు ప్రవహిస్తోంది. పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టు కూడా రాత్రి వరకు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. 80 శాతం చెర్వులు, కుంటలు నీటితో నిండిపోయాయి. కృష్ణా బేసిన్‌లోని బీమా ఉపనది అయిన కాగ్నా నది ఉగ్రరూపం దాల్చడంతో పలుచోట్ల రహదారులకు అంతరాయం ఏర్పడింది. ధారూరు జన్మించిన కాగ్నా నది యాలాల, టంతో ప్రాణాపాయం జరగలేదు. అలియాబాద్– బాబగూడ గ్రామాల రోడ్డుకు వాగు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదే విధంగ ఉద్దెమర్రి, కేశ్వాపూర్ గ్రామాల మధ్య రోడ్డుకు చెట్టు కింద పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగ మారింది. ఉద్దెమర్రి వాగు బ్రిడ్జి వద్ద కూడ నీటిమట్టం పెరుగుతూ జలకళ కొనసాగుతుంది. నీటి మట్టం పెరిగితే మాత్రం బ్రిడ్జిపై నుంచి వెళ్లె అవకాశం ఉంది. ఆదివారం ఉదయం నుంచి కూడ ఎడతెరిపి లేకుండ వర్షం కురువటంతో ప్రజలు ఇళ్లకే ఎక్కువగా పరిమితం అయ్యారు. అత్యవసర పనులు ఉన్న వారు మాత్రమే బయటకు వెళ్లటం జరిగింది. అలియాబాద్ వాగు పెద్ద ఎత్తున నీరు పారుతుండటంతో –బాబగూడ గ్రామానికి రాకపోకలు నిర్వహించే వారికి అంతరాయం ఏర్పడింది. ఉద్దెమర్రి బ్రిడ్జి వద్ద కూడ వాగులో నీటి మట్టం పెరుతూ జలకళ కొనసాగుతూ ఉంది. నీటి మట్టం మరింత పెరిగితే ఉద్దెమర్రి బ్రిడ్జిపై నుంచి వెళ్లె పరిస్థితి ఉంది. శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువు, కుంటలు, వాగులు కొత్త నీటితో జలకళ ఏర్పడింది. భారీ ఎత్తున వాటిలోకి నీరు చేరుతుండటంతో కొన్ని చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. అదే విధంగ భారీ వర్షాలతో శామీర్‌పేట పెద్ద చెరువులోనూ నీటి మట్టం పెరుగుతుంది. మేడ్చల్ పెద్ద చెరువు, మిగతా చెరువులు కూడ నిండటంతో



నస్కల్ వాగు నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు, బషీరాబాద్ మండలాల మీదుగా కర్నాటక లోని సేడెం తాలూకాలో బీమా నదిలో సంగమిస్తుంది. అటు యాద్గిర్ జిల్లాలో కృష్ణా నదిలో ఈ జలాలు కలిసిపోతాయి. యాలాల మండలం కోకట్ వద్ద కాగ్నా నది ఉప్పొంగి ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలు నిలిపివేశారు. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ప్రమాదకరమైన రహదారులు, జలాశయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. బషీరాబాద్ మండలం జీవన్గిలో కాగ్నా నదిలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం నీటి మునిగింది. ప్రతియేటా వర్షాకాలంలో ఆలయం సగం వరకు మునిగిపోతోంది. జుంటుపల్లి అనుబంధ గ్రామం పటేల్ చింత తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ తండాకు రహదారి సరిగ్గా లేక గిరిజనులు వాగుదాటుకుంటూ వస్తుంటారు. కానీ రెండు రోజుల వర్షాలకు తండా వాసులు చాలా ఇబ్బంది పరిస్థితి ఎదుర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని పలు తండాల పరిస్థితి కూడా ఇదే విధంగా తయారైంది. తాండూరు మండలం అల్లాపూర్ వద్ద జాతీయ రహదారిపై ఇంకా బ్రిడ్జీ నిర్మించకపోవడం వల్ల ఓ లారీ బోల్తా కొట్టింది. ఎలాంటి ప్రాణాపాయం జరుగలేదని సమాచారం. వికారాబాద్ పట్టణానికి తాగునీటిని అందించే శివసాగర్ జలాశయం శుక్రవారమే నిండిపోయింది. నందివాగు, కొంశెట్టిపల్లి, అల్లాపూర్ ప్రాజెక్టులకు వరదనీరు చేరుకుంటున్నది. తాండూరులో చిలుకవాగు కబ్జాలకు గురికావడం వల్ల వరదనీరు అనేక కాలనీలను అతలాకుతలం చేసింది. ఆదర్శనగర్, అయ్యప్పనగర్, ఎగువ సాయిపూర్, దిగువ పాత తాండూరు, శాంతినగర్ కాలనీల ప్రజలు తీవ్ర అయోమయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. పలు కాలనీలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తమకు సమాచారం ఇవ్వాలని భరోసా కల్పించారు. చిలుకవాగు ప్రక్షాళన తర్వాత వచ్చే యేడాది వరద ఇబ్బందుల నుంచి బయటపడతామని ఆయన తెలిపారు.

### చెరువు, కుంటలు, వాగుల్లో జలకళ

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల చెరువు, కుంటలు, వాగుల్లో జలకళ కొనసాగుతుంది. లక్ష్మాపూర్‌లో ఓ ఇంటిపై వర్షాలతో చెట్టుకూలింది. ఇంటిపై చివరలో పడ వాగు ద్వారా శామీర్‌పేట పెద్ద చెరువులోకి నీటి వరద చేరుతున్నందున నీటి మట్టం పెరుగుతున్నందున ప్రజలు ఈ పెద్ద చెరువులోపలికి వెళ్లవద్దని శామీర్‌పేట పోలీసులు సూచించటం జరుగుతుంది. శామీర్‌పేట పెద్ద చెరువు కింది వాగులోనూ, అలియాబాద్ వద్ద వాగులో నీరు పొర్లుతూ వెళ్తూ బాబగూడ గ్రామానికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పెద్ద చెరువు కింద ఉన్న వాగులన్ని కూడ నిండి పారుతూ జలకళ తలపిస్తుంది. శామీర్‌పేట పోలీసులు స్పందించి ముందస్తుగా అలియాబాద్ వాగు పారుతున్నందున రోడ్డుకు అంతరాయం ఏర్పడినందున బాబగూడ– అలియాబాద్ మధ్య రాకపోకలు జరపవద్దని, ప్రజలు ఈ రూట్‌లో వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అదే విధంగ శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద కూడ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో, తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని వివిధ గ్రామాల చెరువుల్లోకి వర్షం నీరు చేరుతూ నిండుదశకు చేరుకుంటున్నాయి.

### ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీనది

**పూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు పూడూరు మండలం పరిధిలోని ఈసీనదితోపాటు, వాగులు వంకలు ఆదివారం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కద్మూరు గ్రామం వద్ద ఈసీనది (పెద్దవాగు)పై వంతెన లేకపోవడంతో నదిలో వరదనీటి ఉధృతికి గతరెండు రోజులుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు వచ్చే రెండు, మూడు రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించడంతో ఇప్పట్లో ఈసీనదీ శాంతించే అవకాశంలేదని పలువురు ఈ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. దీంతో ఈ నదీవద్దకు ప్రజలు వెళ్లకుండా గ్రామ పంచాయతీ రోడ్డుకు అడ్డంగా కంచెను ఏర్పాటు చేసింది. ఎగువన ఈసీనదిపై మంచన్‌పల్లివద్ద వంతెనపైనుండి నీరు ప్రవహించడంతో కొన్ని గంటలపాటు ఆ గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలం పరిధిలోని పూడూగుర్తి సమీపంలో సాకెరోనివాగుపై నిర్మిస్తున్న వంతెన అసంపూర్తిగా ఉండడంతో వాగునీటి ఉధృతికి ప్రత్యామ్నయంగా ఏర్పాటు చేసిన రహదారిపై నీరు ప్రవహించి గ్రామస్తుల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. శనివారం తెల్లవారుజామున నుండి మండలంలోని మంచన్‌పల్లి, కంకల్, మరియాపూర్, మాటుగూడ, పూడుగుర్తి, కద్మూరు, చింతల్‌పల్లి, నిజాంపేట్ మేడిపల్లి, పూడూరు సోమన్‌గుర్తి, రాకంచెర్ల, దేవనోనిగూడ, కెరవెల్లి, సిరిగాయపల్లి, పెద్ద ఉమ్మెంతాల్, మేడిపల్లి కలాన్, మేడికొండ, చెన్‌గోముల్, అంగడి చిట్టంపల్లి, కండ్లపల్లి, బాకాపూర్, తుర్కఎన్కెపల్లి తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి సాకెరోనివాగు, బెండ్లవాగు, మొగిళ్ల వాగు, ఒంపుఒడ్క, మామిళ్లఒడ్క తదితర వాగులు, వంకలు పొంగి పొర్లాయి, దీంతో వాగులు, వంకలకు ఇరువైపుల ఉన్న పంటపొలాలు నీట మునిగాయి.

### పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

**షాబాద్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో షాబాద్ మండలంలోని వాగులు పొంగి పొర్లుతుండడంతో చెరువులు నిండు కుండలా మారాయి. మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి వద్ద వాగు పొంగిపొర్లుతుండటంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మీరాపూర్ వద్ద షాబాద్ చెరువులోకి వచ్చే వాగు పొంగిపొర్లుతుంది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. షాబాద్, చందన్‌వెళ్లి పెద్ద చెరువులు నీటితో కలకలలాడుతున్నాయి. నాగర్‌గూడ వద్ద ఈసీవాగు ఎగువన ఉన్న వికారాబాద్ జిల్లా నుంచి వచ్చే నీటితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షాలతో నిండుగా పారుతుంది.

### చెరువు నిండకుండలా పారుతున్న అలుగు

షాబాద్ పహిల్వాన్ చెరువు వద్ద చెరువు నిండకుండానే అలుగుపారుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిండు నిర్లక్ష్యానికి నిదర్శనం. షాబాద్, నరెడ్లగూడ గ్రామాల నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వెనుకాల నుంచి వచ్చే కాలువ నీరు చెరువులోకి రాకుండా అలుగులోంచి బయటకు వెళ్తోంది. చెరువులోకి రావాల్సిన నీరు కాలువలో చెత్త, పిచ్చి మొక్కల కారణంగా దారిమళ్లి అలుగు వద్ద దిగువకు వృథాగా పోతుంది. నీరు వృథాగా పోతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే అధికారులు చెరువులోకి వచ్చే నీటి కాల్వలను సరిచేసి ఉంటే నీరు వృథా అయ్యేది కాదని రైతులు అంటున్నారు.

### పొంగిన వాగులతో.. మర్పల్లికి రాక పోకలు బంద్

**మర్పల్లి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** శనివారం, అధివారం కూరిసిన బారి వర్షనికి మర్పల్లి మండలంలోని సిరిపూరం, వీర్లపల్లి తీమ్మపూరం, పట్లూర్, పంచలింగాల్ వాగులు ఉదృతంగా రోడ్లాపైనుండి ప్రవహించాయి. మర్పల్లికి మోమిన్‌పెట్ బంట్వారం మండలాలనుండిరాకపోకలు అగిపోయాయి. దింతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మర్పల్లి ఎస్సై సురేష్ తన సిబ్బందితో వాగుల వద్ద బందోబస్తు నిర్వహించారు. తహాశిల్దార్ మునవర్దోన్ తన సిబ్బందితో పోలిసులతో పాటు వాగులను పరిశిలించారు. ఎవ్వరు వాగులు దాటకుండా అప్రమత్తం చెసారు. సిరిపూరం, తిమ్మపూరం వాగులు ప్రమాదకరంగా ఉండడంతో వర్షం పడితే చాలు మోమిన్‌పెట్ మర్పల్లికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.

### పొంగినవాగులు నిండిన చెరువులు.. నిలిచిన రాకపోకలు

### నిండు కుండలా లక్నాపూర్ ప్రాజెక్టు

**పరిగి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దాటికి ప్రాజెక్టులు చెరువులు వాగులు నిండు కుండలా తలపిస్తున్నాయి. నియోజకవర్గంలోని లక్నాపూర్ ప్రాజెక్టు నస్కల్ గొడుగోనిపల్లి వాగులను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. మరో 24 గంటలు భారీ వర్షసూచన ఉన్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లోనే బయటికి రావాలని వాగులను ఎవరూ దాటకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. వర్షాలకు పొంగుతున్న వాగుల కారణంగా పరిగి నుంచి వికారాబాద్ పరిగి నుంచి మహబూబ్‌నగర్ రాకపోకలకు అంతరాయం కలిగింది. మహబూబ్‌నగర్‌కు వెళ్లే వాహనదారులను అధికారులు దోమ, కుల్కచర్ల చౌదపూర్ మీదుగా దారి మళ్లించారు. పరిగి మండలం వికారాబాద్ వెళ్లే రోడ్డులో నస్కల్ వారు పొంగడంతో ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే త్వరలో బ్రిడ్జిని నిర్మిస్తామని తెలిపారు.

రైతన్నకు నష్టం అత్యధిక వర్షపాతంతో పలుచోట్ల పంటలు తీవ్రంగా నష్టపోయాయి. వాగులు పొంగి చెరువులు నిండి రైతు వేసిన వరి మొక్కజొన్న పంటల గుండా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలలో పంట పొలాలు నిండిపోయాయి. భారీ వర్షాలకు పలు గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరో రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌ఫార్మర్లు కరెంట్ స్తంభాలు తాకరాదని వాగులు చెరువులు దాటవద్దని ప్రజలకు అధికారులు సూచించాలని ఆయన అన్నారు.

### నస్కల్ వాగును పరిశీలించిన కలెక్టర్

**వికారాబాద్, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:** జిల్లాలో గత రెండు రోజులుగా తేలిక పాటి వర్షాలు కురిసినప్పటికీ.. శనివారం రాత్రి ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో వాగులు వంకలు పొంగి పొర్లాయి. శనివారం రాత్రి మొదలైన వాన..ఆదివారం ఉదయం వరకు దంచి కొట్టడంతో జిల్లాలో ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహించాయి. జిల్లాలోని కోటపల్లి ప్రాజెక్టు, లక్నాపూర్, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు ముత్తడి దాటి ప్రవహించాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు సైతం స్థంభించాయి. ఇండ్లలోకి నీళ్ళు కూడా చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోటపల్లి ప్రాజెక్టు అలుగు దాటి ప్రవహించడంతో నాగసముందర్ వైపు వెళ్ళే రోడ్డు మార్గంలో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివసాగర్ చెరువు అలుగు దాటి ప్రవహించడంతో ధన్నారం మార్గంలోని రాకపోకలు అధికారులు నిలిపి వేశారు. ధాచారం, గిరిగెట్‌పల్లి, గోధంగూడ మార్గాల రాకపోకలు నిలిచిపోయాయి. బంట్వారం మండలం నూరుల్లాపూర్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ధారూరు మండలం ధోర్నాల్ బ్రిడ్జీ పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆమార్గం గుండా రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో కుండపోతగా వర్షం కురవడంతో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. నీటి ప్రవాహం ఉన్న చోట పోలీసు, రెవెన్యూ అధికారులు విధులు నిర్వహించి అటుగా ప్రజలను వెళ్ళనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.



వాగులను పరిశీలిస్తున్న ఎస్సై సురేష్



అలుగు పారుతున్న చౌదపూర్‌లోని కొత్తపల్లి చెరువు



జాతీయ రహదారిపై బోల్తాకొట్టిన లారీ



లక్ష్మాపూర్‌లో వర్షాలతో ఓ ఇంటిపై కూలిన చెట్టు దృశ్యం



శామీర్‌పేట పెద్ద చెరువులోకి నీటి మట్టం పెరుగుతుండటంతో చెరువు జలకళ దృశ్యం

### కొడంగల్ లో అత్యధిక వర్షపాతం నమోదు

జిల్లాలో శని, ఆదివారాలు కుండ పోత వర్షం కురిసిన కారణంగా అత్యధిక వర్ష పాతం నమోదైంది. ముఖ్యంగా కోడంగల్ మండలంలో 122.6 మి.మి వర్షపాతం నమోదైంది. అదేవిధంగా దౌల్తాబాద్ మండలంలో 109.2 మి.మి, యాలాల్ మండలంలో 107.1 మి.మి, బషీరాబాద్ మండలంలో 106.4 మి.మి, కుల్కచర్ల మండలంలో 104.1 మి.మి, తాండూరు మండలంలో 102.2 మి.మి అత్యధిక వర్షపాతం నమోదైంది. చౌడాపూర్ 94.5, దుద్యాల్ 96, మర్పల్లి 34.2, మోమిన్‌పేట్ 99.7, నవాబుపేట్ 81.8, వికారాబాద్ 79.1, పూడూరు 73.2, పరిగి 40.1, దోమ 94.2, బొమ్మరాస్‌పేట్ 88.2, ధారూరు 80.4, కోట్‌పల్లి 65.3, బంట్వారం 47.9, పెద్దెముల్ 72.4 మి.మి వర్షపాతం నమోదైంది. జిల్లాలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్న కారణంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి లు జిల్లాలో పర్యటించి క్రింది స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. పరిగి మండలం నస్కల్ వాగు నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు.



నిండుగా పారుతున్న ఏట్లఎర్రవల్లి వాగు



అలుగు దాటి ప్రవహిస్తున్న కోటపల్లి ప్రాజెక్టు



ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్నా



కూలిన ఇళ్ళును పరిశీలిస్తున్న లొంక నర్సి ములు

## భారీ వర్షానికి కూలిన ఇళ్లు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి తహసిల్దార్

**పెద్దేముల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ కిషన్ అన్నారు. భారీ వర్షానికి పెద్దేముల్ మండలం హన్మాపూర్‌లో పంజుగుల దస్థప్పకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఈ సందర్బంగా తహసిల్దార్ కిషన్ మాట్లాడుతూ ప్రజలు పురాతన ఇండ్లలో ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రైతులు కరెంటు స్థంభాల, ట్రాన్స్‌పార్మర్ల వద్దకు పోవద్దని అన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటవద్దని సూచించారు. గ్రామాలలో ఎవరిదైన ఇల్లు కూలితే తమకు సమాచారం అందించాలని అన్నారు. కూలిన ఇండ్ల బాధితుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా ఇళ్ళ నుంచి బయటకు రావద్దని సూచించారు. హన్మాపూర్‌లో దస్థప్పకు చెందిన ఇల్లు కూలడంతో కాంగ్రెస్‌పార్టీ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ లొంక నర్సి ములు బాధితున్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఇల్లు మంజురయ్యేలా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని భరోసా కల్పించారు.

## ఎదురెదురుగా కారు, డిసిఎం ఢీ

### కారు డ్రైవర్ మృతి.. మృతుడు మహారాష్ట్ర వాసి



చీలాపూర్ గేట్‌వద్ద కేశవరెడ్డి పాఠశాల సమీపంలో కారును ఢీ కొట్టిన డిసిఎం దృశ్యం

**పూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఎదురెదురగా వస్తున్న డిసిఎం కారును ఢీకొట్టిన ఘటనలో కారు డ్రైవర్ అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని కేశవరెడ్డి రెసిడెన్సి యల్ పాఠశాల సమీపంలో హైద్రాబాద్,బీజాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది.చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన లోహెర్ ఫాంలో మహారాష్ట్ర రాష్ట్రం భండార జిల్లా,ఘనోడ్ గ్రామానికి చెందిన చేతక్ ఆనంద్‌రావు ఎండేకర్ (25) అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.అయితే ఆదివారం ఉదయం 6.30గంటల ప్రాంతంలో టిఎస్ 09 ఎఫ్ఎఫ్3377 నెంబరుగల్ల కారులోకూరగాయలు,పాలు తీసుకొని హైద్రాబాద్‌కు వెళుతుండగా, కేశవరెడ్డి పాఠశాల మలుపు వద్దకు రాగానే అతివేగంతో ఎదురుగా వస్తున్న జిఎ 05,టి 6654నెంబరుగల్ల డిసిఎం కారును ఢీ కొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయ్యి,అందులోని డ్రైవర్ చేతక్ ఆనంద్‌రావు తలకు,దవడకు,కాళ్లకు తీవ్రరక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.లోహెర్ ఫాం మేనేజర్ అభిషేక్ కుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అడవి ఒడిలో అంబురామేశ్వరుడు

### నేడు తట్టెపల్లి అంబురామన్న జాతర.. భారీ పోలీసు బందోబస్తు



ముస్తాబైన అంబురామన్న దేవాలయం

**పెద్దేముల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** శ్రావణమాసం ప్రారంభం నుంచి ముగింపు వరకు భక్తులతో కిటకిటలాడుతు,తెలంగాణ,కర్ణాటక సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రశాంతమైన వాతవరణంలో సకల జనుల కోర్కెలు తీర్చే కొంగు బంగారమై వెలిసిన అంబురామేశ్వరుడు పెద్దేముల్ మండల పరిధిలోని తట్టెపల్లి ప్రాంతంలో వెలిసింది. శ్రావణమాసం చివరి సోమవారం(నేడు) నిర్వహించే అంబురామన్న జాతరకు తెలంగాణలోని వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి,హైద్రాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం, బీదర్,సేడెం,చించోలి తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. శ్రావణమాసం నెల రోజుల పాటు నియమనిష్టలతో చేసిన దీక్షలను స్వామివారిని దర్శించిన అనంతరం విరమింపజేస్తారు. ఇక్కడ లభించే ఐదు ఆకుల పుండికూరకు ఎంతో ప్రత్యేకత ఉంది. భక్తుల కోలహలం, భజన,సంకీర్తనలతో ఆలయ పరిసరాలన్ని శివనామస్మరణతో మారుమోగుతాయి. కోరిన కోర్కెలను అంబురామేశ్వరుడు తీరుస్తాడని భక్తుల విశ్వా సం. నందివిగ్రహం నుంచి జాలువారుతున్న నీటి ధారాలను చూసి భక్తులు పరవశం చెందుతారు. సందర్బంగా ఎలాంటి అవాంచనీయమైన సంఘటనలు జరుగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు. జాతరకు విచ్చేసే భక్తులకు మంచి నీటి సౌకర్యం, పార్కింగ్ తదితర వసతులు కల్పిస్తున్నామని ఆలయ కమిటి చైర్మెన్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి అంజప్పతెలిపారు.

### నిరుపేదలకు శ్రేయ ఫౌండేషన్ సాయం

సంపాదనలో ఎంతో కొంత నిరుపేదలకు ఇవ్వడంలో సంతృప్తి ఉంటుంది. ఆ సంతృప్తిని ఎంత పెట్టినా కొనలేం. సామాజిక బాధ్యతను తమ కర్తవ్యంగా భావించి శ్రేయగ్రూప్ ఆఫ్ కంపెనీలు ఔదర్యం చూపించారు. కష్టమర్లు ఉద్యోగులకు వెన్నుదన్నుగా నిలిచారు. ఈ మేరకు ముంబైలోని రాడిసన్‌బ్లూహోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

## జెపి దర్గాలో అరాచకాలను సహించను

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర ఆగ్రహం

షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 01) : పవిత్రమైన జహంగీర్ పీర్ దర్గాలో అరాచకాలను ఎంతమాత్రము సహించేది లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. జహంగీర్ పీర్ దర్గాలో సబ్ కాంట్రాక్టర్, ఇతర వర్గాలకు మధ్య జరిగిన ఘర్షణపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం సందర్బంగా ఈ ఘటనపై మాట్లాడారు. దర్గాలో గతంలో నాన్ లోకల్ కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకొని భక్తులను అన్ని విధాల దోపిడికి గురిచేసేవారని దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామస్థుల అభ్యర్థన మేరకు కాంట్రాక్టును స్థానికులకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. అయితే కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్లు రెండు వర్గాలుగా చీలి డబ్బుల వ్యవహారంలో ఒకరిపై మరొకరు నిందారోపణలు చేసుకుంటూ దర్గా పవిత్రతను మంటగలుపుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. దర్గాలో భక్తులను వేధిస్తే ఇకపై సహించేది లేదని, బలవంతంగా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దర్గాలో గ్రూపులను సహించబోనని హెచ్చరించారు. వ్యక్తిగత కక్ష్యలు సరికావని దర్గా పవిత్రతను దెబ్బతీయాలని ఎవరు ప్రయత్నించినా సహించబోనని అన్నారు.

# భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు,వంకలు



కల్వర్టు దగ్గర వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్,ఎస్పీ

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 01) :** గత రెండు రోజులుగా నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అతలాకుతలం అయ్యారు. వర్షం భీభత్సంతో జన జీవనం స్తంభించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో 13 సెం.మీ వర్షాపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షానికి నియోజకవర్గ వ్యాప్తంగా 19 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండు చెరువుల కట్టలకు గండిపడ్డాయి. వివిధ కారణాల చేత వర్షానికి ముగ్గురు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని నోబుల్ పార్కులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మీర్ అహ్మద్ -రోషన్ దంపతుల కుమారుడైన 13 నెలల చిన్నారి పార్కులోని వర్షం గుంతలో పడి దుర్మరణం పాలయ్యాడు. తల్లిదండ్రులు పార్కులో పనిచేస్తున్న వేళ పిల్లలతో కలిసి ఆడుకుంటున్న ఆరీఫ్ మూడున్నర ఫీట్ల నీరు చేరిన ప్రదేశంలో పడిపోయాడు. కాసేపటి తర్వాత తల్లిదండ్రులు అతన్ని వెతికి బయటికి తీశారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆరీఫ్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అదేవిధంగా లింగారెడ్డిగూడ గ్రామంలో వి. యాదయ్య అనే వ్యక్తి వర్షానికి తలదాచుకునేందుకు గోడ పక్కన నిలబడి ఉన్నాడు. ఈ సమయంలో గోడకు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో పల్ల చెరువు వద్ద చేపలు పట్టడానికి వెళ్ళిన గ్రామానికి చెందిన ఎరుకుల శేఖర్ (35) 20 ఫీట్ల లోతులో పడి మునిగిపోయినట్లు షాద్‌నగర్ సీఐ విజయ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. షాద్‌నగర్‌లో ఆదివారం కురిసిన వర్షం 13 సెం.మీ నమోదైనట్లు ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ పార్థసారథి ప్రభాతవార్తకు తెలిపారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని ఆరు మండలాలు ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కొందుర్గు, చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో కురిసిన విస్తార వర్షాలకు 19 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు ప్రకటించారు. జిల్లేడు-చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ ప్రాంతంలో వరి, జొన్న పంటలు నీట మునిగాయి.

### ఇళ్ళలోకి చేరిన వరదనీరు-కూలిన ఇల్లు-రాకపోకలు బంద్

**కొడంగల్/బొంరాస్‌పేట్ సెప్టెంబర్ 1ప్రభాతవార్త**

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొడంగల,బొంరాస్‌పేట్ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి కొడంగల్ పట్టణంలోని బాలాజీనగర్,కుమ్మరివాడలో పలు ఇళ్ళలోకి వరదనీరు భారీగా చేరడంతో ఆయా కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ జాగరణ చేశారు. అలాగే పట్టణంలోని వినాయక్ చౌరస్తాలో వరదనీరు పలు దుకాణాల్లోకి రావడంతో ఆదివారం ఉదయం నానా ఇబ్బందులు పడుతు వరదనీరును బయటకు పంపేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమీషనర్ బలరాం నాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్‌లు సిబ్బందితో బాలాజీనగర్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించి ఇళ్ళలోని వర దనీరును బయటకు పంపేందుకు చర్యలు తీసుకున్నా రు. మరోపక్క మండల పరిధిలోని ఖాజా అహ్మద్‌పల్లి- చిట్లపల్లి గ్రామాల మద్యగల బ్రిడ్జిపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి.అలాగే అప్పాయిపల్లి-ఆశమ్మకుంట తండా,మైసమ్మ తండాల మద్యలో గల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా తండాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి.భారీ వర్షానికి బొంరాస్‌పేట్ మండల వాప్తంగా చెరువులు అలుగు పారుతున్నాయి.మండల పరిధిలోని ఎర్రుమళ్ళ గ్రామంలో ఉన్న కాకరవాణీ ప్రాజెక్టు,మదనపల్లి తండా చెరువు అలుగు పారుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలావుండగా భారీ వర్షాల కారణంగా మహంతిపూర్ గ్రామంలో కొండమొల హన్మంతు ఇల్లు కూలిపోయింది.కాగా శనివారం 122.2ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

### అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

**కోట్‌పల్లి,సెప్టెంబరు 01, ప్రభాతవార్త;** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. వర్షం కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు సురక్షి తంగా ఉండాలన్నారు. ప్రజలు అవసరమైన ప్రయాణాలు ప్రమాదకరమైన నివాసంలో ఉండకుండా గ్రామీణ ప్రాంతాలల్లో ఉన్న పాఠశాల లాంటి ప్రదేశాన్ని ఎంచుకోవాలన్నారు. గ్రామాలల్లో కాల్వాలు ఉండటంతో వర్షం కారణంగా వాగులు ప్రవహించే అవకాశం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. గ్రామంలోని రైతులు పంట పొల్లాలకు వెళ్ళకూడదన్నారు. ఏవరైతే రైతులు పంట పొల్లాలకు వెళ్ళితే మోటర్లు, స్వీచ్లు వేస్తే వర్షం వల్ల తడిసి ఉండటంతో ప్రమాదలు పోంచి ఉంటుదని కావున రైతులు బోరు మోటర్లు దగ్గరకు స్వీచ్లు వేయవద్దన్నారు. ఇంకా రెండు రోజులు అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఏవరు కుడా ప్రజలు బయటకు రావద్దన్నారు. రోడ్లుపైన ఉన్నటువంటి వీధి లైట్లు స్తంబాలను ట్రాన్స్ ఫర్మర్లును ఎవ్వరు కుడా వాటిని తాకరాద్దన్నారు.

### భారీ వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ,ఎస్పీ

**కొడంగల్,సెప్టెంబర్ 1ప్రభాతవార్త** భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అ ప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్,జిల్లా ఎస్పీ.కే.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.కొడంగల్ పట్టణంలో భారీ వర్షాల నేపథ్యంలో కల్వర్టుల ద్వారా వెళ్ళే వరద ఉధృతిని వారు ఆదివారం పరిశీలించారు. ఉదయం పట్టణంలో జిల్లా ఎస్పీ, ఆర్అండ్‌బీ,మున్సిపల్,ఇరిగేషన్,రెవెన్యూ అధికారులతో రోడ్లపై ఆగి ఉన్న నీటిని క్లీయర్ చేయించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతు రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ సూచనల మేరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని,ప్రజలు ఎవ్వరు కూడ చెరువుల దగ్గరకు వెళ్ళరాదని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.కొడంగల్ చెరువులో కలిసే నాలాలను,నస్కల్ వాగును,పర్సాపూర్ వెళ్ళే వాగులలో వరద ఉధృతిని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అర్అండ్‌బీ,ఇరిగేషన్,మున్సిపల్ అధికారులు, తహశీల్దార విజయ్‌కుమార్ తదితరులున్నారు.

### భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ

**దౌల్తాబాద్,సెప్టెంబర్ 01,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో శనివారంరోజు రాత్రి కురిసిన భారీ వర్షానికి వడ్డే పెద్దఅనంతయ్య ఇంటి గోడ కూలిపోయింది.ఇంటి గోడకూలే సమయంలో వడ్డే అనంతయ్య తన ఇద్దరు భార్యలు,ముగ్గరు కూతుర్లు మొత్తం ఆరుమంది ఇంట్లోనే ఉన్నారు.ఎలాంటి ప్రాణా నష్టం జరగలేదు.నిరుపేద కూలీ అయిన అనంతయ్య ఇంటి గోడ కూలిపోవడంతో ఉండడానికి ఇల్లు లేక తమ కుటుంబం రోడ్డున పడడం జరిగిందన్నారు.ప్రభుత్వం తమ కుటుంబానికి సహాయ సహకారాలు అందిచి తమను ఆదుకోవాలన్నారు.

### చెరువును నుంచి నీటిని పంపేందుకు యత్నం

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలం వెంకటాపర్‌లోని నాడెంచెరువు తూము ధ్వంసం చేసి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని నాడెంచెరువు కట్టను కాంగ్రెస్‌పార్టీ నాయకులు పరిశీలించారు. వర్షాలకు చెరువు నిండటంతో బఫర్‌జోన్‌లో నిర్మాణాల వద్దకు నీరు వస్తుందని బయటకు తూము ద్వారా బయటకు పంపేందుకు శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చెరువు తూము షెటర్‌ను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఇ పరమేశ్ చేరుకొని తూము వద్ద నీరు బయటకు వెళ్లకుండా జేసిబీతో మట్టిని పోసి అడ్డుకట్ట ఏర్పాటు చేయించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు రడమల్ల బోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె.వినోద్‌కుమార్ తదితరులు చేరుకొని తూమును పరిశీలించి మత్స్యకారులు, గ్రామస్తులతో మాట్లాడారు. చెరువులో నీటిని బయటకు పంపించేందుకు పట్టాదారులు, భవన నిర్మాణ దారులు కలిసి మూసి ఉన్న తూము షెటర్‌ను తాడుతో కట్టి పైకి లేపారని, చేపలు దిగువకు వెళ్లాయని మత్స్యకారులు వాపోయారు. ఈసమాచారం రావడంతో పోచారం ఐటీసీ ఇన్‌స్పెక్టర్ బి.రాజువర్మ చేరుకొని పరిశీలించారు. చెరువులో ఎఫ్‌టిఎల్ పరిధిని తగ్గించాలనే దురుద్దేశ్యంతో కొందరు తూముకు ఆటంకం కల్గించారని వజ్రేశ్‌యాదవ్ ఆరోపించారు. దీనిపై హైడ్రా కమీషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక జీవోలతో వెంకటాపూర్ రోడ్డును కుదించారని ట్రాఫిక్ పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనురాగ్ కళాశాల వద్ద తూము ధ్వంస ం చేసిన వారిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాడెం చెరువును ఆ క్రమణదారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈమేరకు చెరువు తూము తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ పరమేశ్ పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రిపోర్టర్ అని చెప్పుకుని వ్యాపారులను బెదిరించి డబ్బు వసూల్

**కొత్తూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** గత శుక్రవారం జరిగిన ఇర వర్గాల ఘర్షణలో అసలు నింధితులను పోలీసులు రిమాండ్ తరలిం చారు. కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ జెపీ దర్గాలో జరిగిన ఇరువ ర్గాల ఘర్షణలో పోలీసుల విచారణలో బిగ్‌టీవీ రిపోర్టర్ ఫయాజ్ అతని గ్యాంగ్‌దేనని తేల్చి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరా ల ప్రకారం... ఫయాజ్ అలియాస్ ఎండీ ఫయాజ్ మునవర్ వృత్తి బిగ్‌టీ వీ రిపోర్టర్, ఇన్ముల్‌నర్వ కొత్తూర్ మండలం అని, నింధితుడు గతంలో తొలి వెలుగు, 4టీవీ, రాజ్ టివి రిపోర్టర్‌గా పనిచేసి జేపీ దర్గాలోని కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్స్, వ్యాపారస్థులను, కంపెనీ యాజమాన్యం, స్కూల్ల దగ్గరికి వెళ్లి రిపోర్టర్‌ను అని బెదిరించి నెలవారి మామూళ్లు వసూల్ చేశాడు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత చానెల్‌లకు సంబంధిత హెడ్‌ఆఫీస్‌లో ఫిర్యాదు చేయగా రిపోర్టర్‌గా తొలగించారు. తర్వాత యూట్యూబ్ చానెల్ పెట్టుకుని ఇన్ముల్‌నర్వ గ్రామస్థులైన మీర్జా షౌకత్,సదాక్ అలియాస్ మహమ్మద్ సాదిక్, ఎండీ అర్షద్, ఎండీ జమిల్ అన్సారి మరికొంత మందితో వర్గం ఏర్పాటు చేసుకుని కట్టెలు, రాడ్స్ పట్టుకుని మళ్లి యేథావిధిగా నెలవారి మామూళ్లు బెదిరించి, కొట్టి దౌర్జన్యంగా వసూల్ చేసేవాడు. ఈమధ్యన బిగ్‌టీవీ రిపోర్టర్‌గా చేరి కూడా తన పద్దతి మార్చుకోకుండా యేథావిధిగా వసూల్ చేసేవాడు. జేపీ దర్గా సబ్ కాంట్రాక్టర్స్ హబీబ్, సయ్యద్ రఫీక్, నవాజ్, సయ్యద్ మహమ్మద్ సయ్యాద్ అస్మత్‌లా దగ్గర ప్రతి నెల రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూల్ చేసినాడు. ఏక మొత్తంలో రూ.5లక్షలు డిమాండ్ చేయడంతో సబ్ కాంట్రాక్టర్స్ ఒప్పుకోకపోవడంతో అగస్టు 30న కట్టెలు చెక్కలతో, చాకుతో బజ్జీలు వేంచే జాలితో విచక్షణ రహితంగా కొట్టి గాయపర్చినారు. రఫిక్ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ నరసింహారావు నింధితులను పట్టుకునుటకు బృందా లుగా ఏర్పడి గాలిస్తుండగా శనివారం సాయంత్రం 5:20గంటలకు నింధితులు తిమ్మాపూర్ బస్టాప్‌లో ఉండగా ఫయాజ్ అలియాస్, ఎండి ఫయాజ్ మునవర్ తండ్రి ఎండీ సజ్జద్ మునవర్‌తో పాటు మీర్జా షౌకత్, మహమ్మద్ సాదిక్, ఎండీ అర్షద్ తండ్రి ఎండీ నయూద్, ఎండీ జమిల్ అన్సారి తండ్రి ఎండీ అఖిల్ అన్సారి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.



కొడంగల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

## పాత పెన్షన్‌ను పునరుద్దరించాలి

**కొడంగల్,సెప్టెంబర్ 1ప్రభాతవార్త**

సెప్టెంబర్ 1న సీపీఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని ఆదివారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు తెలంగాణా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తలపెట్టిన ఉద్యోగ,ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల టీజీఈజేఏసీ అద్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా టీజీఈజేఏసీ జిల్లా నాయకులు ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ మాట్లాడుతు సీపీఎస్ విద్రోహ దినాన్ని సెప్టెంబర్ 1న 2004న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి పాత పెన్షన్‌ను తొలగించడం ద్వార ఉద్యోగ,ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాశాయని నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి రాష్ట్రంలో మొదలుకొని స్వరాష్ట్రం వరకు సీపీఎస్ రద్దు కొరకు సెప్టెంబర్ 1న సీపీఎస్ విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన తెలుపడం జరుగుతుందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో రెండు లక్షల యాభైవేల ఉద్యోగుల ఐక్యతను చాటుతూ తెలంగాణా వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని తెలిపారు.టీజీఈజేఏసీ మండల బాధ్యులు క్రాంతికుమార్ మాట్లాడుతు ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ అనంతరం భద్రతగా నిలిచే పెన్షన్ లేకపోవడం తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నది అన్నారు.ఇందుకుగాను ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల సందర్బంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్‌ను పునరుద్దరించాలని కోరారు.కార్యక్రమంలో దినేష్‌కుమార్, అశోక్,వేణు,రమేష్,కరుణాకర్, చంద్రకాంత్,వెంకట్‌రాములు,అశోక్,రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ధారూర్,సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని వికారాబాద్ జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ఉద్రిక్తికి నాగసం బందర్ ధారూర్ మధ్యలో ఉన్న కల్వర్టుపై భారీగా వరద రావడంతో వికారాబాద్ డివిజన్ ఆర్డీవో వాసుచంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ రైతులు ప్రయాణికులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ శ్రీనివాస్ఎండిపివో నరసింహు లు కోట్‌పల్లి ఎంపిడివో డానియల్ ఎంపివో షఫిఉల్లాఖాన్ ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ పంచాయతీ కార్యదర్శి మహబూబ్ శ్రీనివాస్ బాల్‌రా జ్ తిరుపతి తదితరులు ఉన్నారు.

### వినాయక ఉత్సవాల మేడ్చల్ అసెంబ్లీ కోకన్వీనర్‌గా రవీందర్‌గౌడ్

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** వినాయక ఉత్సవాల సందర్భంగ మేడ్చల్ అసెంబ్లీ కోకన్వీనర్‌గా ఎన్.రవీందర్‌గౌడ్ (తూంకుంట) నియమితులయ్యారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీకి చెందిన ఎన్.రవీందర్‌గౌడ్‌ను వినాయక ఉత్సవాల సందర్భంగ భాగ్యనగర్ వినాయక ఉత్సవాల నిర్వాహణ కమిటీ వారు వినాయక ఉత్సవాల మేడ్చల్ అసెంబ్లీ కోకన్వీనర్‌గా నియమించటం జరిగిందని ఎన్.రవీందర్‌గౌడ్ తెలిపారు.

## భారీ వర్షాలతో నేడు జిల్లాలో పాఠశాలలకు సెలవు

### కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి రద్దు.. కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త**

భారీ వర్షాలు కురుస్తున్నందున మరో 24గంటల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు, అదే విధంగ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఆదివారం ఆయన భారీ వర్షాలను పురస్కరించుకుని జిల్లా ప్రజలు అందరు అప్రమత్తంగ ఉండాలని, పిల్లలను, వృద్దులను బయటకు పంపవద్దని, విద్యార్థులకు సోమవారం పాఠశాలలకు సెలవు ఇవ్వటం జరిగిందన్నారు. వర్షాలను పురస్కరించుకుని జిల్లా అధికార యంత్రాంగం అంతా రిస్కు ఆపరేషన్స్ నిర్వహిస్తున్నందున సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు రాకుండ చూడాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఎడతెరిపి లేకుండ వర్షాలు కురుస్తున్నందున అత్యవసర పరిస్థితిలో మాత్రమే ప్రజలు బయటకు వెళ్లాలని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు 9492409781ను సంప్రదించవచ్చుని కలెక్టర్ ప్రజలకు సూచించారు. జిల్లాలోని మున్సిపాల్టీ కార్యాలయాల్లో, ఎంపిడిఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయటం జరిగిందని కలెక్టర్ అన్నారు. వర్షాలతో ఇబ్బందులు ఉంటే కంట్రోల్‌రూమ్‌కు, మున్సిపల్ ఆఫీస్‌కు, ఎంపిడిఓ ఆఫీస్‌లకు ఫోన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

## రాజీవ్‌రహదారిపై కూలిన చెట్ల తొలగింపు

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త**

కురుస్తున్న భారీ వర్షాలతో ఆదివారం హకీంపేట్ రాజీవ్‌రహదారిన రోడ్డుపై చెట్లు కూలటంతో జెసిబిలను పెట్టి తూంకుంట మున్సిపల్ అధికారులు,సిబ్బంది, పోలీసులు కలిసి రోడ్డునుంచి తొలగించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని హకీంపేట్ వద్ద రాజీవ్‌రహదారిన రోడ్డుపై చెట్లు వర్షంతో కూలటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది, పోలీసులు స్పందించి రాజీవ్‌రహదారిని క్లియర్ చేయటంతో వాహనాల రాకపోకలు ఆ తరువాత కొనసాగాయి. అదే విధంగ తూంకుంట, అంతాయిపల్లి, దేవరయాంజాల్‌లో అధిక వర్షపాతంతో ఏర్పడిన ఇబ్బందులను మున్సిపల్ సంబంధిత అధికారులు పరిష్కరించారు.

## విద్యుధ్ఘాతంతో విజ్ఞాన్ ప్రిన్సిపాల్ మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో ఓ స్కూల్ ప్రిన్సిపాల్ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని విజ్ఞాన్ ప్రభోధనాంద స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు (48) తాను నివాసం ఉంటున్న భవనంపైన వర్షానికి నీరు చేరడంతో తొలగించే ప్రయత్నంలో కరెంట్‌షాక్ తగిలి మృత్యువాత పడ్డారు. ఉదయం అల్పాహారం చేసిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు ఉదయం 10 గంటలకు తన భవనంలోకి వెళ్లి పైన చూడగా నీరు నిలిచినట్లు కనిపించడంతో పైకి వెళ్లి చెత్తను శు భ్రం చేసి నీటిని తొలగించేందుకు ప్రయత్నించగా పక్కనే కరెంట్ తీగలు ఉండటంతో ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఆదివారం స్కూల్‌కు సెలవు కావడంతో ఉదయం ప్రిన్సిపాల్ చనిపోగా సాయంత్రం వరకు ఎవరు చూడలేకపోయారు. సాయంత్రం 4:45 గంటలకు ఉపాధ్యాయుడు రాజేశ్ ప్రిన్సిపాల్ మృతదేహాన్ని గమనించి స్కూల్ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. మృతుడు శ్రీనివాస్‌రావు ఖమ్మం పట్టణానికి చెందిన వాడు కాగా స్కూల్‌లో ఒంటరిగానే ఉంటున్నాడని తన కుటుంబం ఖమ్మంలో ఉంటు న్నారని తెలిపారు. విజ్ఞాన్ ప్రభోధానంద స్కూల్‌లో గత రెండున్నర సంవత్సరాలుగా ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడని తెలిపారు.

## క్యాన్సర్‌రోగికి ఆర్థిక సాయం అందజేత

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** గత 3 నెలలుగా క్యాన్సర్‌తో భాధపడుతున్న గిద్ద నరసయ్యకు సైన్‌రైజ్ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం అందజేశారు. నాగర్‌కర్నూల్ కు చెందిన నరసయ్యకు నోటి క్యాన్సర్ కారణంగా రెండుసార్లు శస్త్రచికిత్స చేయించారు. తిరిగి ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ధారించడంతో వైద్య ఖర్చులు లక్షన్నర రుపాయలు అవుతాయని తెలిపారు. ఈమేరకు సన్‌రైజ్ ట్రస్టు సభ్యులు



మోత్కూరి శరబంధ ద్వారా సహాయం కోరుతూ సన్‌రైజ్ ట్రస్టును ఆశ్రయించారు. ట్రస్టు ద్వారా రూ.10,000లు అందించగా శరబంధ తన వంతు సాయంగా వెయ్యి రుపా యలు అందజేశారు. ఈకార్యక్రమంలో వై.సుందరరావు, బి.సోమ య్య, డి.ఐలయ్య, ఎం.శరబంధ, ఎ.వీరారెడ్డి, బి.విష్ణువర్ధన్‌రెడ్డి, మద్ది శ్రీకాంత్, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR RANGA REDDY DISTRICT; T.S. DISPUTE.NO: 136 OF 2024.**

BETWEEN:

**M/s. Shriram Chits (India) Private Limited.,** Vikarabad Branch, Rep by its: Manager cum GPA Holder **...DISPUTANT**

AND

**1. Mr. P. Mahesh Kumar,** S/o. P. Krishna, Aged about 37 Years, R/o. H.No: 2-4-51/1, Lopalikunta (Vil), Sadashivapet (Mdl),Medak Dist PIN:50229,Telangana State, Occ: Business.

**2. Mr. N. Ananthaiah,** S/o. N. Kistaiah, Aged about 42 Years, R/o. H.No: 2-67, Godamguda (Vill), Vikarabad (Mdl), Vikarabad Dist PIN: 501101, Occ: Office Subordinate, EMP Code: 1471494, O/o R & B Division Vikarabad Dist Telangana State.

**3. Mr. K. Narsimulu,** S/o. Ananthaiah, Aged about 36 Years, R/o. H.No:3-5, Godamguda (Vill), Vikarabad (Mdl), Vikarabad Dist, PIN: 501101, Telangana State, Occ: Track Mntr II engineering, EMP Code: 242le100222, O/o. South Central Railway Vikarabad (Vil) (Mdl), Vikarabad Dist,Telangana State.

**4. Mr. K. Srinivas,** S/o. K. Ramulu, Aged about 33 Years, R/o. H.No: 3-8-58/18/6/7/2, Sainagar Colony, Sadasivapet Medak District, PIN: 502291, Telangana State, Occ: MRF LTD, EMP Code:611656, O/o MRF Limited at Sadashivapet .

**5. Mr. A. Lalu Singh,** S/o. A. Damla Naik, Aged About 36 Years, R/o. H.No:3-10, Narsapur Tanda, Marpally (Vill), Marpally (Mdl), Vikarabad Dist, PIN: 501202,Telangana State, Occ: Police Constable EmpCode: 1418084, O/o Police station Cyberabad, Hyderabad. **.....Opponents**

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.1,39,079-00** (One Lakh Thirty Nine Thousand Seventy Nine Only) and the same is posted to Date: **24-09-2024** for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator R.R.DISTRICT (WEST) IInd Floor, Sony Complex, Narayana College Building, Prashanth Nagar, I.E., Kukatpally, Hyderabad. AT: RANGA REDDY (DIST), At 12-00 A.M. if you fail to attend the office of Deputy Registrar of Chits/ Arbitrator, on that day the case will be heard and decided exparte.

(By ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)

**M. SHIVA SHEKAR, M. CHANDRA SHEKAR ADVOCATES**
H.NO: 11-3-664/191, Parsigutta, SECUNDERABAD,

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR RANGA REDDY DISTRICT; T.S. DISPUTE.NO: 274 OF 2024.**

BETWEEN:

**M/s. Shriram Chits (India) Private Limited.,** Vikarabad Branch, Rep by its: Manager cum GPA Holder **...DISPUTANT**

AND

**1. Mr. Khader Mohammed,** S/o. Mohammed Rabbani, Aged about 54 Years, R/o. H.No: 8-10-16, Old Tandur Village & Tandur Mandal, PIN:501141, Telangana State, Occ: Business M/s. A-1 Furniture Home Needs At Tandur Village and Mandal Ranga Reddy District.

**2. Mr. T. Anil Kumar,** S/o. Veeresham, Aged about 40 Years,R/o.H.No:3-64, Mambapur Villaged, Tandur Mandal, Ranga Reddy District, PIN: 501142, Occ: Village Revenue Officers, EMP Code: 1462279, O/o Office Of the Tahsildar At Basheerabad Village and Mandal, Vikarabad District Telangana State.

**3. Mr. M. Naresh,** S/o. Husainappa, Aged about 33 Years, R/o. H.No: 6-8-25, Gandhinagar, Tandur Village & Mandal Vikarabad District, PIN: 501141, Telangana State, Occ: Public Health Worker, EMP Code: 1445257, O/o. Department of Municipal Administration at Tandur Village and Mandal, Vikarabad District, Telangana State .

**4. Mr. Syed Gulam Mujtaba,** S/o. Syed Gulam Hyder, Aged about 57 Years, R/o. H.No: 8-6-35, Tandur Village & Mandal Vikarabad District, PIN: 501141, Telangana State, Occ: Sanitary Jawan, O/o. Department of Municipal Administration, Tandur Village and Mandal, Vikarabad District, Telangana State.

**5. Mr. Mohammed Wajeed Pasha,** S/o. Late Mohd Yousuf,Aged about 40 Years, R/o. H.No: 8-10-36/3, Old Tandur Village Tandur Mandal,Vikarabad District, PIN: 501141, Telangana State, Occ: Business, M/s. Bharath Furniture at Tandur Village & Mandal, Vikarabad Dist. **...Opponents**

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.48,540-00** (Fourth Eighty Thousand Five Hundred Fourth Only) and the same is posted to Date: 24-09-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator R.R.DISTRICT (WEST) IInd Floor, Sony Complex, Narayana College Building,Prashanth Nagar, I.E., Kukatpally, Hyderabad. AT: RANGA REDDY (DIST),At 12-00 A.M. if you fail to attend the office of Deputy Registrar of Chits/Arbitrator, on that day the case will be heard and decided exparte.

(By ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)

**M. SHIVA SHEKAR, M. CHANDRA SHEKAR ADVOCATES**
H.NO: 11-3-664/191, Parsigutta, SECUNDERABAD,

# టేక్మాల్ నుండి జోగిపేట వైపు రాక పోకలు బంద్

## - భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం...



వర్షాలకు వంతెనపై నుంచి గుండు వాగు పొర్లుతున్న దృశ్యం

**టేక్మాల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజానీకం అవస్థలు పడ్డారు. టేక్మాల్ మండల పరిధిలోని వాగులు వంకలు నిండు కుండలుగా మారి అలుగులు పారుతున్నాయి. టేక్మాల్ నుండి ధనూర వెళ్లే రోడ్డును గుండు కమ్మేసింది. అటు కుసంగి ధనూర మధ్యలో గల రోడ్డు, ఎలకుర్తి శేరుపల్లి రహదారులపై నుండి గుండుపొంగి ప్రవహించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టేక్మాల్ తహశీల్దార్ తులసిరాం, ఎంపిడిఒ రియాజోద్దీన్, ఆర్ఐ శ్రీకాంత్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాక పోకలు పూర్తిగా నిలిపి వేశారు. ప్రమాదం పొంచి ఉందని ఎవరు రోడ్డు దాటే సాహసం చేయవద్దన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి బొడ్మట్‌పల్లిలో జనమ్మ, సాలోజిపల్లి గ్రామల్లో పోచయ్యలకు చెందినవిళ్లు కూలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న వారంత ఖాళీ చేసి సమీపంలో ఉన్న పాఠశాలల్లో, గ్రామ పంచాయితీ భవనాల్లోనఉండాలన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు విద్యుత్ వాడకం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని టేక్మాల్ తహశీల్ధర్ తులసిరాం సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్లలోంచి బయటకు వెళ్ల వద్దన్నారు.అనవసరంగా బయటకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు.

### ఆదర్శపాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆదర్శపాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో విద్యను అభ్యసించినపూర్వవిద్యార్థులు ఆదివారం రోజున పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఎంతో ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి రోజులను స్నేహితులు నెమరు వేసుకుంటూ ఆనందోత్సవాలతో రోజును గడిపారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందించి ఆశీర్వచనాలు అందుకున్నారు. సుమారు 24 సంవత్సరాల తరువాత ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు ఈ ఆత్మీయసమ్మేళనాన్నిజరుపుకోవడం,ఎంతో అద్భుతంగా ఏర్పాటు చేసినఈకార్యక్రమానికి తమను గుర్తు పెట్టుకుని ఆహ్వానించడం ఆనందంగా ఉందని పూర్వ ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# వరదనీటితో నిండిన ప్రాజెక్టులు

**సిర్గాపూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని నల్లవాగు ప్రాజెక్టులోకి వరద నీరు కొనసాగుతోందని ప్రాజెక్టు ఏఈ సూర్యకాంత్ తెలిపారు. గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల వరద నీరు చేరిందని అధికారి వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 1493 అడుగులు కాగా ప్రస్తుతం 1485 అడుగుల వద్ద నీరు స్టోరేజ్ అయినట్లు సూర్యకాంత్ వెల్లడించారు.

### అలుగుపారుతున్న ఉజలంపాడ్ ప్రాజెక్టు...

మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామ శివారులోని ఉజలంపాడ్ ప్రాజెక్టు నిండుకుని అలుగు పారుతోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుకుంటోంది. ప్రాజెక్టు నిండుకుని దిగువకు వరద జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగు చేసుకుంటున్న పంటలు నీటమునిగాయి.

## తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేటలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు.పట్టణ కేంద్రంలో వర్షం నీరు రోడ్లపై వరదలుగా ప్రవహిస్తున్నందున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు వర్షాలపై అధికారులు,నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు.పట్టణంలో ఇండ్లు కూలే దిశలో ఉన్న వాటిని మున్సిపల్ అధికారులు గుర్తించి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలని సూచించారు.ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి భయటకు వెళ్లవద్దన్నారు.

## రేపు న్యాల్‌కల్‌లో రైతుల నిరాహార దీక్ష

**న్యాల్‌కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల శివారులో ఫార్మాసిటీ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈ నెల 3వ తారీఖున మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో ఆయా గ్రామాల రైతులతో కలిసి నిరాహార దీక్షను నిర్వహిస్తున్నట్లు రైతు ఉద్యమకారుడు ఆనంద్ ఈశ్వర్ తెలిపారు.

# వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### - చెరువులు, కుంటలను పరిశీలించిన తహశీల్దార్ గంగాభవాని

**గుమ్మడిదల, సెప్టెంబర్1 ప్రభాతవార్త:** గతరెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోనిఅన్ని గ్రామాల చెరువులను, కుంటలను ఆదివారం మండల తహశీల్దార్ గంగ భవాని, ఎస్ఐ మహేశ్వర్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. గుమ్మడిదల, అనంతారం, కానుకుంట, వీరారెడ్డిపల్లి, వీరన్నగూడెం, బొంతపల్లి, అన్నారం, దోమడుగు, మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని అన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లోని అధికారులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ చెరువులను, కుంటలను 24 గంటలు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత మట్టుకు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని, అలాగే పాడుబడిన ఇళ్లలో ఉండరాదని తెలిపారు. ప్రస్తుతం నీటి కుండలా ఉన్నా చెరువు, కుంటలపై ప్రజలకు వారి గ్రామాల్లో ఏ మాత్రం అనుమానం ఉన్నా తక్షణమే స్పందించి మండల అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా కోరారు. మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు ఉన్నందున గ్రామ స్థాయిలోని అధికారులు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

## మార్కండేయ దేవాలయంలో పూజలు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** శ్రావణ మాసం మాస శివరాత్రి సందర్భంగాసిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో ఆదివారం స్వామివారికి శ్రీరామకోటి భక్త సమాజం, వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేద పండితులు మల్లికార్జున్ నాగేందర్, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామం సుభిక్షానికి మైకోడ్‌లో హోమాలు

**మనూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని మైకోడ్ గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి మాసంలో వచ్చే మొదటి ఆదివారం హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి ఆదివారం గ్రామానికి చెందిన దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన పదవి దంపతులు ఆలయంలో హోమాలు, యజ్ఞాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో భీమన్న, గంగయ్య స్వామి, శివరాజ్, సంగమేశ్వర్, రఘురాం, రేవన్న, పోచారం సంగన్న, బీరప్ప, నాగన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేతకి ఆలయంలో మాజీ ఎంపి పూజలు

**ఝరాసంగం, సెప్టెంబరు 1,** ప్రభాతవార్త మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మాజీ ఎంపి బిబి పాటిల్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న బిబి పాటిల్‌ను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా బిబి పాటిల్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బిబి పాటిల్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు విజయేందర్‌రెడ్డి, సంతు పాటిల్, నాయకులు, ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, శివప్రసాద్ స్వామి, రికార్డు అసిస్టెంటు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శిశుమందిర్‌లో సామూహిక అగ్నిహోత్రం

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్1 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం ఉదయం విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక అగ్నిహోత్రం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ ఫౌండేషన్ బాధ్యులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి అగ్నిహోత్రం హోమాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో అగ్నిహోత్రం చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని వివరించారు. విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం అన్ని గ్రామాల్లో అగ్నిహోత్రం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్‌రెడ్డి, సీతారామారావు, వీరప్ప, సతీష్‌గౌడ్, మల్లేశం, గాండ్ల సంగమేశ్వర్, సర్వేశ్వర్, చంద్రశేఖర్, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిని కలిసిన బిజెపి నేత అరుణ్‌రాజ్

**సిర్గాపూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణానికి చేరుకున్న మాజీ ఎంపి బిబి పాటిల్‌ను బిజెపి నేత అరుణ్‌రాజ్ శేరికార్ ఆదివారం కలుసుకున్నారు. జహీరాబాద్‌కు స్మార్ట్ సిటీని మంజూరు చేయడం పట్ల కేంద్రానికి అరుణ్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. 10వేల కోట్లతో పూర్తయ్యే స్మార్ట్ సిటీలో ఉద్యోగ అవకాశాలు మెండగా లభిస్తాయని ఆరుణ్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చాప్టే బస్వరాజ్, సుభాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఎడతెరిపి లేని వర్షాలు-నీట మునిగిన పంటలు

## - లబోదిబోమంటున్న అన్నదాతలు



ఎన్‌కెఎల్ పి-1: **న్యాల్‌కల్‌లో వర్షానికి నీటిపాలైన పెసర పంటను పరిశీలిస్తు రైతు విఠల్‌రెడ్డి**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** అందరికి అన్నం పెట్టే అన్నదాతలు నిత్యం అవస్థలు పడుతూనే ఉంటారు. పంటల సాగుకు అతి వర్షంతోనో, లేక అనావృష్టితోనే రైతులు దిగాలు చెందడం సర్వసాధారణం మారింది. పంటల విత్తనాలు విత్తుకున్న నాటి నుంచి రైతులు కొన్ని మార్లు వరుణదేవుడి కరుణకోసం పూజా కార్యక్రమాలు నిర్వహించే రైతన్నలు పంటలను కోత కోసే సమయాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో ఇన్నాళ్లు కష్టించి పండించిన పంటలు నీటి పాలవుతుంటే రైతుల కంట కన్నీరు కారుతూ ఉంటుంది. గత రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు పండించిన పెసర, మినుపు పంటలు కోత దశలో ఉండటంతో వర్షాలకు నీటిపాలై మురిగిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పెసర, మినుము పంటలు నీటిపాలయినాయి.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల మూలంగా ప్రజలకు ప్రాణ, ఆస్థినష్టం జరగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. వర్షాలతో ప్రజలకు ఎక్కడైన ఇబ్బందులు వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. పొంగిపోర్లుతున్న వాగులు, వంకల వద్దకు చిన్నపిల్లలను వెళ్లనివొద్దన్నారు. వర్షాల మూలంగా నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చిన పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలన్నార. భారీ వర్షాల మూలంగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరిసింహ, జిల్లా కలెక్టర్ మను చౌదరి, సీపీ డా॥అనురాధ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు.

## వర్షంతో జాగ్రత్తగా ఉండండి : తహశీల్దార్, ఎస్ఐ

**మనూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ వెంకటస్వామి, ఎస్ఐ చల్లా రాజశేఖర్‌లు మండల ప్రజలకు వేరు వేరుగా సూచించారు. గ్రామాల్లో విద్యుత్ స్థంభాలు, చెట్ల వద్ద నిల్చోవద్దన్నారు. పొంగిబొర్లుతున్న వాగులు, వంకల వద్ద సెల్ఫీల కొరకు ప్రయత్నించవద్దన్నారు. అత్యవసరమైతే తప్ప ఇంటి గడప దాటవద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదని, ప్రత్యామ్నాయంగా సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అత్యవసరమైతే కంట్రోల్ రూం 9290558580కు కాల్ చేయాలని తహసీల్దార్ వెంకటస్వామి, 8712656758ను సంప్రదించాలని ఎస్ఐ రాజశేఖర్‌లు మండల ప్రజలకు సూచించారు.

## అవసరమైతేనే గడప దాటండి : ఎస్ ఐ క్రాంతికుమార్

**పుల్కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతేనే ప్రజలు తమ ఇంటి గడప దాటి బయటకు పోవాలని ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ సూచించారు. రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ స్థంభాలు, చెట్ల కింద నిల్చోకూడదన్నారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున చేపటు పట్టే వారు, పశువుల కాపరులు, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే 8712656754కు లేదా 100కు సమాచారం అందించాలని ఎస్ఐ క్రాంతి కుమార్ సూచించారు.

## భారీ వర్షాలపై ప్రజలు అవగాహనతో ఉండాలి

**నారాయణఖేడ్, సెప్టెంబరు 1,** ప్రభాతవార్త: రానున్న రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది మోహీద్ పటేల్ సూచించారు. అత్యవసర పనులు ఉంటేనే కాని ప్రజలు తమ ఇంటి బయటకు పోవద్దని, విద్యుత్ స్థంభాలు, చెట్లు, వాగులు, వంకలకు దూరంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే విద్యుత్, మున్సిపల్ డిజాస్టర్ రెస్పాన్స్ బృంధాలు అందుబాటులో ఉంటాయని ఆయన సూచించారు. భారీ వర్షాలతో ప్రజలు అవస్థలు పడకుండా ఇండ్లలోకి వరద నీరు ప్రవేశించకుండా, రోడ్లపై నీరు నిల్చోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు మోహీద్ పటేల్ సూచించారు.

# మండలంలో పొంగిపొర్లుతున్న వాగులు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా మండల ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల శివారులోని వాగులు, వంకలు పొంగి బొర్లుతుండటంతో అటుగా ప్రజలకు ప్రయాణించే అవకాశం లేకుండా పోతోంది. వర్షాలకు దెబ్బతిన్న సాగు చేస్తున్న పంటలను పరిశీలించేందుకు వెళ్లే అవకాశం లేక రైతులు ఇంట్లోనే బెంగతో అల్లాడుతున్నారు. మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని మామిడ్లవాగు పొంగిబొర్లుతుండటంటో రేజింతల్ నుంచి ఝరాసంగం, ఎల్గోయి, పొట్టిపల్లి గ్రామాలకురాకపోకాలు పూర్తిగా ఆగిపోయారు. గత సంవత్సరం ఇదే వాగుదాటుతుండగా ఓ వ్యక్తి చెరవులో కొట్టుకుపోయి మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఆదివారం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి మండలంలోని హద్నూర్, రేజింతల్, డప్పూర్ గ్రామాల శివారులోని వాగులను పరిశీలించి ప్రజలకుపలుసూచనలు చేశారు. పొంగిబొర్తుతున్న వాగులతో ప్రజలు, ప్రయాణీకులు అవస్థలు పడకుండా ఉండేందుకు కానిస్టేబుల్, ఇద్దరు విఆర్ఓలను ఉంచినట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పేర్కొన్నారు.

## సిఐగా పదోన్నతి పొందిన రామునాయుడు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** హద్నూర్ పోలీసు ఠాణాలో ఎస్ఐగా సేవలు అందిస్తున్న రామునాయుడు సిఐగా పదోన్నతి పొందారు. సిఐగా పదోన్నతి కల్పిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో హద్నూర్ పోలీసులు, మండల నాయకులు రామునాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

## పొంగుతున్న వాగులతో జాగ్రత్తగా ఉండాలి : తహశీల్దార్

ఝరాసంగం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దొరుయతరం, ఎస్ఐ నరేష్‌లు మండల ప్రజలకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్గోయి, ప్యారవరం గ్రామాల్లో బొర్లుతున్న వాగులను అధికారులు పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రజలు వాగులు, వంకలు దాటవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు అటుగా వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అధికారుల వెంట పంచాయితీ కార్యదర్శి యాసిన్, రాజ్‌కుమార్‌లు ఉన్నారు.

## చిల్డ్రన్ హోంకు శిథిలావస్థ నివాసులు

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 1,** ప్రభాతవార్త: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉంటున్న వారిని చిల్డ్రన్‌హోమ్‌కు తరలించినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ తెలిపారు. నిజాంపేట గ్రామానికి చెందిన దూదేకుల రిజ్వాన్ తన కుటుంబ సభ్యులతో కలసి నారాయణఖేడ్ పట్టణంలోని మంగల్‌పేట్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారని, అద్దె ఇల్లు శిథిలావస్థలో ఉండటంతోముందుజాగ్రత్తగా మున్సిపల్ అధికారులుపట్టణంలోని చిల్డ్రన్‌హోంకు తరలించారన్నారు. మున్సిపల్ పరిధిలో కూలే దశలో ఉన్న ఇండ్లలో ఎవరైనా ఉంటే మున్సిపల్ వారికి సమాచారం అందిస్తే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారని వైస్ చైర్మన్ దారం శంకర్ మున్సిపల్ ప్రజలకు సూచించారు

## భారీ వర్షాలకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**గుమ్మడిదల, సెప్టెంబర్1 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల రాబోయే మరో మూడు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు ఉండటం మూలంగా గుమ్మడిదల మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ విపత్తును ఎదుర్కోవాలని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరవధికంగా పడుతున్న వర్షానికి పాడుబడ్డ ఇళ్లలో ఉండరాదని, అలాగే చెరువులు, కుంటలు, నాలాలు నిండి పొంగిపొర్లే అవకాశం ఉన్నందున అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ఇళ్లలోనే ఉంటూ ఎప్పటికప్పుడు గ్రామ, మండల అధికారులతో అనుసంధానం ఏర్పరచుకొని సమాచారం చేరవేయాలని కోరారు. అలాగే ప్రజలు వేడి నీరు, వేడి ఆహారం తీసుకొని పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఈ సమయంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున సాధ్యమైనంత మట్టుకు శుభ్రత పాటించి ఇళ్లలోనే ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు వ్యాపించకుండా కొద్దిగా ఆరోగ్యం పట్ల అనుమానం ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి పర్యవేక్షణలో తగు మందులు వాడుతూ జాగ్రత్త వహించాలని మండల ప్రజలకు తెలియజేశారు.

# పొంగిన మంజీర : దుర్గా ఆలయం మూసివేత

## -రాజగోపురం వద్ద భక్తుల పూజాలు

**పాపన్నపేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మంజీరా నది పొంగిపొర్లుతోంది. మంజీరా నది బోర్లుతుండటంతో వనదుర్గా ప్రాజెక్టు వరవళ్లు తొక్కుతూ దుర్గామాత ఆలయం ముందర నుంచి నిజాంసాగర్ వైపు పరుగులీడుతుండటంతో ఏడుపాయల వన దుర్గా భవాని మాత ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ముసివేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకుంటున్నారు. ఆలయం ముందు నుంచి వరద నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో భక్తులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేదుకు ఆలయాన్ని మూసేసి రాజగోపురంలో అమ్మవారికి పూజా కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. వర్షాలుతగ్గే వరకు రాజ గోపురం లోనే భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆలయానికి జిల్లా ఎస్పి ఉదయ్ కుమార్‌రెడ్డి డిఎస్‌పితో చేరుకుని ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవా లని బాధ్యులను ఆదేశించారు. భక్తులు రాజగోపు రం ముందుగా బారికేడ్లు దాటి ఆలయం వైపు వెళ్లవద్దని ఎస్పి సూచించారు.



ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం మూసివేస్తున్న అర్చకులు

# వర్షానికి కూలిన డిపో ప్రహరీ గోడ

## మరమ్మత్తులు చేయాలని కాలనీ వాసుల వేడుకోలు

**హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు01, ప్రభాతవార్త :** శనివారం సాయంత్రం నుండి కురుస్తున్న భారీ వర్షానికి ఆదివారం రోజున హుస్నాబాద్ బస్‌డిపో ప్రహరీ గోడ కూలిపోయింది. అయితే ఈ గోడ కూలలిపోయే అవకాశం ఉంది మరమ్మ త్తులు వెంటనే చేపట్టాలని కాలనీ వాసులు గతంలో పలు మార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేరని డిపో కాలనీలో ఉండే రాజుయాదవ్‌తో పాటు కాలనీ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం కూలిన ప్రహరీ గోడను పరిశీలించిన వారు మాట్లాడుతూ కూలిన గోడకు ఆనుకుని ఉన్న అడ్డుగా ఉన్న గోడ సైతం శిథిలావస్థకు చేరిందని కనీసం దానినైనా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ ప్రహరీ గోడల మరమత్తులు చేయకుంటే కాలనీ వాసులకు ప్రాణభయం ఉందన్నారు. విషయం చెప్పేందుకు డిపో మేనేజరుకు ఫోన్ చేస్తే ఆయన స్పందించడం లేదని ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించాలని వేడుకుంటున్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసి నాయకులు గ్యాదరి పరమేశ్వర్ డిమాండ్ చేశారు.ఆదివారం రోజున ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో నూతన ఫించన్ విధానాన్ని రద్దు చేసి పాన విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ చౌరస్తా నుండి ఎసిపి కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభత్వం తీసుకొచ్చిన నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని,ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్,శశిధర్‌శర్మ, రాజేశం, యాదగిరి,భూపాల్,విజేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి,దేవరాజ్ పాల్గొన్నారు.

# బడంపేటకు చేరుకున్న మహాపాదయాత్ర

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఆగూర్ శివరాజ్, సిద్దాపురం అరుణ్‌ల ఆధ్వర్యంలో బడంపేట రెండో మహాపాదయాత్ర ఆదివారం ఘనంగా ముగిసింది. జహీరాబాద్ పట్టణం నుంచి బయలు దేరిన మహాపాదయాత్ర కోహీర్ మండలంలోని బడంపేటలో శ్రీ రాచన్నస్వామి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపి బిబి పాటిల్, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు మధుశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిమిశెట్టి జయప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు గందికి రాజు, జిల్లా కోశాధికారి చంద్రకాంత్, జిల్లా ఆర్గనైజింగ కార్యదర్శి బండి శ్రీనివాస్, అరుణ కౌలాస్, ఉదయ్ కౌలాస్, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

**వర్గల్, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త):** వర్గల్ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి ఆలయం శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడంతో పాటు సామూహికసత్యనారాయణ వ్రతాలు జరిపించుకున్నారు. 4వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది, గౌరారం అవుట్‌పోస్ట్ పోలీస్ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

# ఉమా సంగమేశ్వర ఆలయంలో

## కాశీ బుగ్గ దర్శనం : పరవశించిన భక్త జనం

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్1 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోలు ఉమా సంగమేశ్వర స్వామి ఆలయం గర్భగుడిలో ఆదివారం ఉదయం కాశీ బుగ్గ (నీరు) రావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసనప్పుడు ఆలయ గర్భాలయంలోకి ప్రత్యేకంగా నీరు రావడాన్ని కాశీబుగ్గ అని, ఇక్కడి ప్రాంత భక్తుల నమ్మకం, కొప్పోలు ఉమా సంగేశ్వర స్వామి గర్భాలయంలో కాశీ బుగ్గ రావడతో ఈ నీటిని భక్తులకు తీర్థంగా ఇచ్చినట్లు ఆలయ పూజారి సంగప్ప తెలిపారు. దాదాపు గత పది సంవత్సరాల క్రితం కాశీ బుగ్గ వచ్చినందని, ఈ సంవత్సరం శ్రావణమాసంలో కాశీ బుగ్గ వచ్చిందని పూజారులు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు కీర్తనలు భజనలు చేశారు. ఆలయంలో భక్తులందరికీ కల్హేర్ మండలానికి చెందిన గుర్రపు మచ్చేందర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఆలయాలను దర్శించుకున్న రాజస్థాన్ అడ్వకేట్ జనరల్

**ఝరాసంగం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాజస్థాన్ అడ్వకేట్ జనరల్ శక్తి ఉదయ్‌కుమార్ సాగర్ ఆదివారం శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని, మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి ఆశ్రమాన్ని కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయానికి, ఆశ్రమానికి చేరుకున్న ఉదయ్‌కుమార్‌ను ఆలయ, ఆశ్రమ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దత్తగిరి ఆశ్రమంలో ఉదయ్ కుమార్ జ్యోతిర్లింగాలను, శనైశ్వరుడిని, పంచ వృక్షాలను దర్శించుకుని ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామాణి అవదూతగిరి మహారాజ్ డాక్టర సిద్దేశ్వర మహారాజ్‌ల ఆశీర్వచనం అందుకున్నారు.